# ౨౦. మార్పులేని బతుకు

నేను భోజనానికి కూర్చున్నాను. ఉద్యోగానికి వెళ్లడానికి వేళవుతోంది. శ్రీమతి కూడా ఇంట్లోలేదు. మా అమ్మాయి వచ్చి, ఎవరో ముసలామె నాకోసం వచ్చిందని చెప్పింది. ఎవరో చందాలకో, సహాయం కోసమో వస్తుంటారు. ఈ ముసలామె కూడా ఇబ్బందిలో వుండవచ్చుననుకున్నాను. నా జేబులో నున్న రూపాయో,రెండు రూపాయలో ఆమె కివ్వమన్నాను.

నా భోజనమైన తరువాత బట్టలు వేసుకొని హాలులోకి వచ్చాను. అప్పటికి కూడా ఆ ముసలావిడ వెళ్లిపోలేదు. బల్లమీద కూర్చుంది.

మా అమ్మాయిని పిలిచి కారణమడిగాము.

ఆమె శ్రీమతి కోసం వచ్చిందట.

సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చిన తరువాత నా కళ్లనే నమ్మలేకపోయాను. పొద్దున్న వచ్చిన ముసలామె స్వేచ్ఛగా ఇంట్లో తిరుగుతున్నది. శ్రీమతి కావలసినవి అందిస్తుంటే ఆమెవండుతున్నది.

నాకు చాల కోపం వచ్చింది. నా భార్యను గదిలోకి పిలిచి ఆ ముసలామెకా ఉద్యోగం ఎవరిచ్చారని అడిగాను.

'నేనే ఆమెను పిలిచాను. పండుగరోజులు. ఇంటినిండా పిల్లలు, మనుషులు, వంట వండడానికి నాకు శక్తి చాలకుండా పోతున్నది. సామానులందిస్తే ఆమె వండి పడేస్తానన్నారు' అంది శ్రీమతి.

"మరెవర్షూ నీకు వంటకు దొరకలేదా? ఈ ముసలామెను ఇబ్బంది పెట్టడం ఏమైనా బాగుందా?" అన్నాను నేను.

"అదా మీ అనుమానం ముసలామెకు డెబ్బైయేళ్లున్నమాట వాస్తవమే. పురుళ్ళా, పుణ్యాలా? ఆమెకు పళ్లన్నీ దిట్టంగానే వున్నాయి. మూడో ఏటే పెళ్లయిందట. అయిదో ఏటే మొగుడు పోయాడట! వున్నవాళ్లందరూ కాదంటే ఆమె ఇలా వంట వండుకుంటూ బతుకుతున్నది. ఆమె రోజుకోపూట మాత్రమే భోజనం చేస్తుంది. రాత్రికి ఏ నీళ్ళో, మజ్జిగో తాగి పడుకుంటుంది. ఈ పండుగలలో సాయం చేసి పెడితే తరువాత సంగతి ఆలోచించవచ్చు" అంది శ్రీమతి.

అయినా ఆ ముసలామెను కష్టపెట్టడం నాకు మనస్కరించలేదు.

ఆ ముసలామె వండిపెడుతున్నది. పేరు మోసిన లాయరుగారింట చాలా కాలం పని చేసిందట. ఆమెకు డబ్బుకు కూడా లోటు లేదు. బాంకిలో ఆమె డబ్బే చాలా వుందట.

మరి ఆమె కెందుకీ ఉద్యోగం?

ఇంట్లో కొత్తావిడొకరు వండిపెడుతున్నట్లు కూడా మరచిపోయాము. ఆమె ఉదయమే లేస్తుంది. స్నానం చేసి వంటకు తయారవుతుంది. అప్పుడప్పుడు కాఫీలు పెట్టి ఇస్తుంది. రాత్రి పూట ఫలహారం కూడా తయారు చేస్తున్నది. వంటలు బాగానే వున్నాయి. భోజనాలయిన తరువాత టి.వి. దగ్గర కూర్చుంటుంది. మధ్యాహ్నం పూట చంటిపిల్లను తీసినట్లు సాయంకాలం వంట లేనప్పుడు పిల్లలకు కథలు చెప్పినట్లు ఆమె కాలం గడుపుతుంది.

ఒకరోజు మధ్యాహ్నం, ఏదో పనిమీద ఇంటికి రావలసి వచ్చింది. శ్రీమతి నిద్రపోతున్నది. హాలు పక్కనున్న గదిలోంచి మాటలు వినిపిస్తున్నవి. ముసలావిడ ఎవరితోనో మాట్లాడుతున్నది.

"ఒసే కన్నతల్లీ, ఏదో మంచివాళ్లింటపడ్డానే. చీకూ చింతా లేదు. శక్తి వున్న మేరకు వండుతున్నాను. మిగిలినది వాళ్ళే చూసుకుంటున్నారు. అన్నిటికన్నా గొప్ప విశేషమేమిటంటే, పిల్లలందరూ నా చుట్టూ మూగుతారు. నా కథలు విని ఒకటే నవ్వుతారు. చంటిపిల్ల సంగతి మరీ చెప్పనక్కర్లేదే! నన్ను చూడగానే చేతులు చాస్తుందే!"

ఆ ముసలామె తన మనసులోని కష్టాలు, సుఖాలు వచ్చిన ఆవిడతో చెప్పుకుంటున్నది. వంటరిగా బతుకు నీడుస్తున్న ముసలామె మనసు మూలలలో దాగిన చిన్న కోరికలు, చెరిగిపోని బాధలు తెలుసుకున్న తరువాత నా మనసు కలత బారింది.

దీపావళి ఇంకా నాలుగు రోజులే వుంది. ఇల్లు సందడిగా వుంది. సాయంకాలం, వేళుండగానే ఇంటికి వచ్చి హాలులో కూచోని కాఫీ తాగుతున్నాను.

"బాబుగారూ! సెలవిప్పించండి. వెళ్తున్నాను"

ముసిలామె నా ఎదుట వంగిన శరీరంతో నిలబడి కళ్లనుంచి జారిన రెండు నీటి బొట్లు తుడుచుకుంది. మరేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

నాకేమీ అర్థం కాలేదు

శ్రీమతి దగ్గిరకి విసురుగా నడిచాను.

"ముసలామె నెందుకు పంపించావు?"

" దానికి కారణాలున్నాయి" అంది శ్రీమతి.

"లక్ష కారణాలుండవచ్చు. ఈ రెండు రోజులూ, పండుగయిన తరువాత ఆమెను పంపించివేయవచ్చుకదా!"

"ఆమె వండలేకపోతున్నది."

"మీరు వండి ఆమెకు పెట్టవలసింది. పండుగ రోజులలో ముసలామెను నడివీధిలోకి నడిపించావు"

"అంతే మరి"

ముసలామెను పంపించివేయడానికి కారణాలు ఏముంటాయి? ఆమె దుబారాచేస్తున్నదని, గిన్నెలు కాళ్లమీద పడేసుకుంటున్నదని, నూనె వంపేసిందని...

ఇలాంటివి ఎన్నో,ఎన్నో...

నా మనసు చాలా బాధపడింది.

ఆమె ఎక్కడికి పోతుంది.?

అదో నరకం. ఆ ఇంట్లో పిచ్చిదాకర్తె అరుస్తూ వుంటుంది. వీధిఅరుగుమీద దోమలు. కాలువకంపు. వర్షానికి, చలికి కూడా ఆమె విచారించలేదు.

మా ఇంటి పిల్లలు ఆమెను 'మామ్మా!' అని పిలుస్తారు.

దీపావళి పండుగకు వాళ్ళందరినీ దీవించి తలంటుతానంది.

పిల్లలకు మంచి మంచి కథలు చెప్తానంది.

చంటి పిల్లకు బొమ్మ కొని తెస్తానంది.

కానీ, అవన్నీ కలగానే నిలిచిపోయాయి.

ఆమెకు నిజంగా మిగిలినది మార్పులేని బతుకు మాత్రమే!

(ఆంధ్రజ్యోతి - దీపావళి సంచిక)

☆